క్లుప్తంగా

రేపు అభయహస్త ఆంజనేస్వామి తిరునాల

పీలేరు : స్థానిక యర్రమరెడ్డిగుట్టలోని శ్రీ అభయహస్త ఆంజనేస్వామి తిరునాల గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 8.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, వడపూజ, ఆకుపూజ, హోమం, తీర్థప్రసాదాలు వినియోగం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 3.30 గంటల నుంచి పీలేరు పట్టణంలో స్వామివారి ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు ప్రాతులు కావాలని కోరారు.

భూతగాదాలో నలుగురిపై కేసు

పెద్దతిప్పసముద్రం: భూ తగాదాలో దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక బి.కొత్తకోట రోడ్డులోని సిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న భూమిని సర్వేయర్ కొలతలు వేస్తుండగా జీ.సయ్యద్‌బాషా, జే.సాదిక్‌బాషాతో పాటు మరో ఇద్దరు కలసి వీరి దాయాదులైన మహమ్మద్ అలీ, మహబూబ్‌బాషా, రఫీలపై దాడికి పాల్పడ్డారు. మహమ్మద్ అలీ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసామని ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి మహాభారతయజ్ఞం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గురువారం నుంచి పంచమవేద మహాభారత యజ్ఞం ధ్వజారోహణంలో ప్రారంభం అవుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహాభారతయజ్ఞం 18 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్తూరుకు చెందిన భాగవతారిణి జ్యోత్స్నచే పగలు హరికథాకాలక్షేపం, ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి రోజూ రాత్రి శ్రీ వెంకటేశ్వర నాట్యకళామండలిచే రాత్రి నాటకాలు ఉంటాయని తెలిపారు.

మృత్యుంజయేశ్వర ఆలయంలో కుంభాభిషేకం



పూజలు చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న మృత్యుంజయేశ్వర శివాలయంలో మంగళవారం కుంభాభిషేకం నిర్వహించారు.వేద పండితులు లక్ష్మణ, అమర,బాలాజీలు వేద మంత్రోచ్ఛరణలతో పూజలు,అభిషేకాలు చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


హంస వాహనంపై ఏనుగుమల్లమ్మ



ప్రత్యేల అలంకరణలతో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. విగ్రహానికి ప్రత్యేక పుష్పాలతో, వెండి కవచం, కిరిటం, నగలతో అలంకరించారు. ఉదయం సుగంధద్రవ్యాలతో అభిషేకాలు, అక్కదేవతలకు పూజలు, వె వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా సాయంత్రం భక్తులు బోనాలు, జ్యోతులు మోసి ఆలయం చేరుకున్నారు. ఏనుగుమల్లమ్మకు పూజలు జరిపి మొక్కలు తీర్చుకున్నారు. సాయంత్రం మేళతాళాలతో గ్రామోత్సవ వేడుకలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఏనుగుమల్లమ్మను దర్శించుకున్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా నిలవండి



వైవీ సుబ్బారెడ్డితో కెఎస్‌మస్తాన్ అహమ్మద్

కలకడ : గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ నాయకులు అండగా నిలవాలని పార్లమెంటు సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సూచించినట్లు పీలేరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు కెఎస్ మస్తాన్ అహమ్మద్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్పొరేషన్ చైర్మ డాక్టర్ ఇబ్లాఅహమ్మద్‌తో కలిసి వైవి సుబ్బారెడ్డిని కలిశారు. వచ్చే నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ మరింత బలపడుతుందని, కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.

భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



రెడ్డివారిపల్లె వద్ద సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ

జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

నిమ్మనపల్లె: భూ రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన నిమ్మనపల్లి మండలంలో పర్యటించారు. రెడ్డివారి పల్లెలో భూ రీ సర్వే పనులు, పిట్టావాండ్లపల్లెలో చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో పలు రిజిస్టర్ లను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రెవెన్యూ కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. వివిధ సేవల కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. భూ రీ సర్వే పనుల్లో అవకతవకలు జరగకుండా క్షుణ్ణంగా సర్వే చేసి, రైతుల సమక్షంలో రెవెన్యూ రికార్డులలో ఉన్న వారి భూమి వివరాలు తెలియజేసి నమోదు చేయాలన్నారు. భవిష్యత్తులో భూమికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు, భూ రీ సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు బియ్యం, చక్కెర, పప్పు వంటి సరుకులు చౌక దుకాణాల వద్దనే అందించాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భూ రీ సర్వే పనులు, రెవెన్యూ సేవలు ప్రజలకు ఆమోదయోగ్యంగా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, డీటీ సిరాజుద్దీన్, ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ గోపీనాథ్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, వీఆర్వో హేమాంబర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు ఆక్రమిస్తే కేసులు



నాయునిచెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫనికుమార్, తదితరులు

కలకడ : మండలంలోని చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు, కేసులు తప్పవని తహసీల్దార్ ఫనికుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామం సమీపంలోని నాయుని చెరువు గ్రామస్తులు, గుడిబండ పంచాయతీలోని తెట్టు, పాపిగారిపల్లె, గ్రామాల రైతులు పాడిపశువులకు నీరు, మేతకోసం ఆశ్రయించే వారని, సదరు చెరువును కొందరు ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. చెరువుకు గండి కొట్టడం వలన చుక్కనీరు లేకుండపోతోంది. చెరువు నీటిపై ఆధారపడిన సాగురైతులకు నీరు లేకపోవడంతో వ్యవసాయం చేయడం కూడా మానివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు, చెరువు పోరంబోకు, ఆక్రమణలు తొలగించి ఉపాధిహామీ పథకం ద్వారా చెరువు అభివృద్ధి చేయాలని, కావులకు గండిపూడ్చి అభివృద్ధి చేయాలని రైతులు కోరారు.

రేపు హనుమాన్ జయంతి

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22న హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ, వడమాల అలంకార పూజతో పాటు రాత్రికి తిరుపతికి చెందిన నాగరత్న భాగవతారిణిచే హరికథా కాలక్షేపం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లింగవివక్ష చట్టరీత్యా నేరం

– సీడీపీఓ సుజాత



లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత

నిమ్మనపల్లె : ఆడపిల్లలపై లింగ వివక్ష చూపవద్దని ఐసీడీయఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. మంగళవారం రాచవేటివారిపల్లి సచివాలయం వద్ద కిషోరి బాలిక వికాసం వేసవి శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనన్నారు. ఆడవారిపై లింగ వివక్ష చూపితే అది చట్టరీత్యా నేరమన్నారు. మహిళలు, పురుషులతో సమానంగా నేడు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారన్నారు . తల్లిదండ్రులు ఆడపిల్లలను, మగపిల్లలతో సమానంగా చూడాలని, ఉన్నత చదువు అందించాలని సూచించారు. ఇప్పటికీ ఆడపిల్లలు జన్మిస్తే రోడ్డున పడేస్తూ అనాథలు చేస్తున్నారని ఇటువంటి వారిపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుందన్నారు. సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలో, మహిళలు సాధిస్తున్న ఘనతలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కిషోరి వికాసం వేసవికాలం శిక్షణ తరగతుల ప్రణాళికలలో భాగంగా, గ్రామాలలోని మహిళలకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, సమాజంలో మహిళ ఉన్నత స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాను, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేపల మార్కెట్



తలుపులు తెరచుకొని చేపల మార్కెట్

పీలేరు రూరల్ : స్థానిక వారపుసంత ఆవరణలో ఉన్న చేపలమార్కెట్ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. గత 12 సంవత్సరాల క్రితం మత్స్య శాఖ ఆర్‌కేవీవో నిధులు రూ. 7.50 లక్షల వ్యయంతో చేపల మార్కెట్ కోసం భవనాన్ని నిర్మించారు. అయితే 12 సంవత్సరాలు పూర్తి అవుతున్నా చేపల మార్కెట్ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని వాడకంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

– ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

మదనపల్లె రూరల్ : పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కార్మికులను, ఉద్యోగులను నయా బానిసలుగా చేసే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపుకృష్ణప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా, అదానీ, అంబానీల కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలన చేస్తోందన్నారు. స్వాతంత్ర్యానికి ముందే బ్రిటీష్ పాలకులపై పోరాడి కార్మికులు సాధించుకున్న హక్కులను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రద్దు చేసిన భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. మదనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాలు మే ఆఖరికి ఇస్తామని చెప్పిన హామీ ప్రకారం పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, పట్టణ కార్యదర్శి తిరుమల,చలపతి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న భీమేశ్వర్‌రావు

పీలేరు : ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణాల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

తాలూకా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ మహేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తుపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం రోడ్‌సేఫ్టీ అవేర్‌నెస్, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, గ్యాంబ్లింగ్, కోడిపందేలపై దృష్టి పెట్టాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మండలపరిధిలో రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళావెంకటరమణ, ఎస్‌ఐ గాయత్రి పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసరాలు పంపిణీ చేయండి

తంబళ్లపల్లె: మండలంలోని చౌక దుకాణ డీలర్లు కార్డుదారులకు నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీలర్లు వారి వారి పరిధిలో కార్డుదారులకు అందుబాటులో ఉండి నిత్యాసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎక్కడైనా అవకతకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశానికి ఎండీయూ ఆపరేటర్లు హాజరుకాకపోవడం కొనమెరుపు. ఎండీయూల విషయమైన విలేకర్లు అడగగా వారిని నిలుపుదల చేస్తున్నట్లు ఆదేశాలు రాలేదన్నారు. సమావేశంలో డీటీ భువనేశ్వరి, చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

క్లస్టర్ వ్యవస్థతో అధిక భారం, పని ఒత్తిడి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

కలకడ : ప్రభుత్వం రెవెన్యూశాఖలో ఏర్పాటు చేయనున్న క్లస్టర్ వ్యవస్థతో వీఆర్‌ఓలపై అధిక పని భారం, పని ఒత్తిడి పెరుగుతాయని వీఆర్‌ఓలు ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 4 రద్దు చేయాలని తహసీల్దార్ ఫనికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈమేరకు వీఆర్‌ఓలు అందరూ వారి సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. క్లస్టర్ పరిధిలో 2–4 గ్రామాలు వరకూ ఉండటంతో 8వేల ఎకరాల సాగు భూములు విస్తీర్ణం వరకూ ఉంటాయన్నారు. దీంతో రైతులకు సకాలంలో సరైన న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్–2 వీఆర్‌ఓలను కూడీ డీడీఓగా మార్చాల్సిందిగా కోరారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రక్తదానం

రాయచోటి జగదాంబసెంటర్ : పీలేరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనూష అనే గర్భిణికి రక్తం అవసరం ఉండటంతో రక్తదానం చేయించినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ డా.సయ్యద్ మైనుద్దీన్ తెలిపారు. గర్భిణి బంధువులను తమను సంప్రదించడంతో రాయచోటిలోని బ్లడ్ బ్యాంకులో నాగరాజు అనే దాతచే బీ పాజిటివ్ రక్తం అందించారు.

వేరుశనగ విత్తన పంపిణీకి సిద్ధం



మాట్లాడుతున్న ఏడీఏ శివశంకర్

మదనపల్లె రూరల్ : ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు పంపిణీ చేసేందుకు మదనపల్లె వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లోని రైతుసేవా కేంద్రాల్లో విత్తనకాయలను సిద్ధంగా ఉంచినట్లు ఏడీఏ శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీతో కిలో రూ.55.80 చొప్పున 30 కిలోల బస్తా రూ.1,674గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. మదనపల్లె వ్యవసాయశాఖ పరిధిలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు సంబంధించి కే–6 రకం 14,976 క్వింటాళ్లు, నిమ్మనపల్లె మండలానికి నారాయణి రకం 800 క్వింటాళ్లు..టీసీజీఎస్1694 రకం 499.5 రకం క్వింటాళ్లు...మొత్తం కలిపి 16,275.5 క్వింటాళ్లు రైతుసేవాకేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకంను తీసుకెళ్లి రైతుసేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు సాధించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ నందకుమార్ రెడ్డి

కురబలకోట: ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తి చేయాలని ఏపీడీ నందకుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని దిగువబోయపల్లె వద్ద ఫీడర్ చానల్ పనులను తనిఖీ చేశారు. పని విధానం, సమస్యల గురించి కూలీలతో మాట్లాడారు. ప్రజల జీవితాల్లో ఉపాధి హామీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పనులను పారదర్శకంగా చేయాలని దుర్వినియోగానికి ఆస్కారం ఉండకూడదన్నారు. రోజు వారి కూలి రూ.307కు తగ్గకుండా వచ్చే విధంగా చూడాలన్నారు. రైతులు ఉపాధి హామీ కింద పశు గ్రాసం పెంచుకుంటే అర ఎకరంకు రూ. 27 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత కంపోస్టు పీట్లను తవ్వుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకం కూడా అవకాశం ఉందన్నారు. పెండింగ్ బిల్లులు మూడు రోజుల్లో ఖాతాలకు జమ అవుతాయన్నారు. ఈ నెలాఖరుకు ప్రతిపంచాయతీలో 25 ఫారం పాండ్ గుంతలను పూర్తి చేయాలన్నారు. ఏపీడీ సుబ్రమణ్యం, టీఏ నాగన్న గౌడ్, క్లస్టర్ టీఏ బాబాజీ, రామమూర్తి, ఎఫ్ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం, కార్మికసంఘాల నాయకులు

మదనపల్లె రూరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేదలకు వ్యతిరేకంగా కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన చేస్తున్నాయని, ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్ లు రద్దు చెయ్యాలి. కనీస వేతనం 26వేలు ఇవ్వాలి. రైతు పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. టమోటా మార్కెట్ లో జాక్ పాట్ రద్దు చెయ్యాలి, ఉపాధి పని 200రోజులకు పెంచాలి. 600 రూపాయలు వేతనం ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలుకై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20వ తేదిన సమ్మెకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దేశంలో వచ్చిన మతోన్మాద, ఉగ్రవాద చర్యలు నేపథ్యంలో సమ్మె వాయిదా వేశారని, కేంద్ర ప్రభుత్వ దుర్మార్గమైన ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా చేస్తున్నట్లు వివరించారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ రద్దు చేయడం, ఇండియన్ లేబర్ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం, నెలవారీ కనీస వేతనం రూ. 26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ పెన్షన్ రూ. 9,000 అందించడం సహా పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రానివారికి నెలకు రూ. 6,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల వ్యతిరేకతను అర్థం చేసుకుని చట్టాలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కి సిద్ధమవుతున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ.ప్రభాకర్ రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, నాగరత్న, కృష్ణ, సవిత, రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శంకర్ నాయక్, గౌరీ, ప్రమీల, సుగుణ, ప్రభావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మారెమ్మ జాతర



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ జాతర మంగళవారం కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని, గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు మేళతాళాల నడుమ గ్రామం నుండి ఊరేగింపుగా దీవేలు మోసుకుంటు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. అలాగే గ్రామం చుట్టు వెలసిన గ్రామదేవతలు సత్యమ్మ, సప్పలమ్మ, నడివీధి, గంగమ్మకు మహిళలు దీపాలు మోసి మొక్కులు చెల్లించారు. పంచాయతీలోని మట్లవారిపల్లె, పెద్దకురప్పల్లె గ్రామాలలో మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకీపై ఊరేగించారు. ఇంటింటా మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. మండలంలోని నలుమూలల నుంచినే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

జలమయమైన ఆర్టీసీ బస్టాండ్



వర్షపునీటితో జలమయమైన పీలేరు ఆర్టీసీ బస్టాండ్



మదనపల్లెలోని బెంగళూరు బస్టాండు నిలిచిన వర్షపు నీరు

పీలేరు రూరల్ : పీలేరులో కురిసిన వర్షానికి ఆర్టీసీ బస్టాండ్, ఎల్‌బీఎస్ రోడ్డు మొత్తం జలమయమైంది. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పీలేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎల్‌బీఎస్ రోడ్డు, రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాలు మొత్తం వర్షపు నీటితో నిండిపోయాయి. స్థానిక పంచాయతీ మిట్ట నుంచి రైల్వే ట్రాక్ వరు ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో రోడ్డు మొత్తం బురదమయమైంది. అలాగే మంగళవారం వర్షపుసంత మొత్తం చిత్తడిమయంగా మారింది. మండలంలోని 24.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార భీమేశ్వర్‌రావు తెలిపారు.

మదనపల్లెలో మోస్తరు వర్షం

మదనపల్లె సిటీ: పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండవేడిమి ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగింది. వర్షం కురవడంతో స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు పొంగిపొర్లింది. అప్పారావువీధి దారిలో నీటి మడుగుగా మారింది. మురుగు నీరు దుర్వాసనకు ప్రజలు అవస్థలు పడ్డారు. స్థానిక ప్రశాంత్‌నగర్ వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో చెరువుగా మారింది. స్థానిక ఎంఎల్ఎల్ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్, ప్రశాంత్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాహుదా, బుగ్గకాల్వల్లో నీరు పొంగిపొర్లింది.